ఉద్యోగ సంఘం ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి

అఫ్జల్‌గంజ్: నిబంధనలు ఉల్లంఘించిన ఉద్యోగ సంఘం ప్రతినిధులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని టీజీ ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘం ప్రతినిధులు బి.రామస్వామి, జి.తిరుపతి డిమాండ్ చేశారు.సోమవారం అఫ్జల్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్లుగా సంఘం ఎన్నికలు నిర్వహించకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అసలు సిసలైన స్వాతంత్య్ర సమరయోధుడు వీర్ సావర్కర్

గోల్కొండ: వినాయక్ దామోదర్ సావర్కర్ అసలు సిసలైన భారత స్వాతంత్య్ర సమరయోధుడని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.ఉమామహేందర్ అన్నారు. కార్వాన్ వీర్ సావర్కర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 28న జరగనున్న వీర్ సావర్కర్ జయంతి వేడుకల కరపత్రం, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. 28న గుడిమల్కాపూర్‌లోని శ్రీకృష్ణ భవన్‌లో జరిగే జయంతి వేడుకలకు రావాల్సిందిగా ఆయనను కోరారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జొన్నకుంటి మధుసూదన్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, సద్గురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలి

యాకుత్‌పురా: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా జీహెచ్‌ఎంసీ అందజేసి క్రీడా సామగ్రిని సోమవారం రెయిన్‌బజార్‌లో కార్పొరేటర్లతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రీడా మైదానల అభివృద్ధికి చర్యలు తీసుకుంటూ సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బజార్, సంతోష్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, ముజఫర్ హుస్సేన్,గేమ్స్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రవూఫ్,మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు

గౌలిపురా: పుణ్యశ్లోక లోకమాత రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం గౌలిపురా కోదండ రామ స్వామి దేవాలయం వద్ద రంగోళి పోటీలను నిర్వహించారు. మామిడాల స్వప్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ పాల్గొని అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి, నాయకులు జమాల్‌పూర్ శేఖర్, మహేశ్, అశోక్, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు దశరథ లక్ష్మి, రేణుక, రేణుక ముదిరాజ్, జ్యోతి, మహిళా నాయకురాలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఆడిట్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఫీజులు పెంచొద్దు

నాంపల్లి: ఇంజినీరింగ్ కాలేజీలలో ఆడిట్‌ను పరిగణనలోకి తీసుకోకుండా.. ఫ్యాకల్టీకి వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తూ.. ఫీజులు పెంచాలనే ప్రతిపాదనను ఆమోదించొద్దని టీపీటీఎల్‌ఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్ మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డిని కలిసి మెమొరాండం అందజేశారు. జేఎన్‌టీయూ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల ఆడిట్‌ను పరిగణనలోకి తీసుకుని ఇంజినీరింగ్ కాలేజీలలో ఫీజుల పెంపును పరిశీలించాలని కోరారు. దీంతో చైర్మన్ వి.బాలక్రిష్ణారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ.. ఫీజులు పెంచాలని తాము కోరడం లేదని చెప్పినట్లు పేర్కొన్నారు.

బురద మండి!

- అధ్వానంగా జియాగూడ మేకల మండి పరిసరాలు
- మండి పరిసర బస్తీల ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


జియాగూడ మేకల మండి


బురదమయంగా జియాగూడ మేకల మండి

జియాగూడ: నగరంలోని ప్రధాన మేకల మండిల్లో ఒకటైన జియాగూడ మేకల మండి సమస్యల వలయంలో చిక్కుకుంది. దీంతో మండికి వచ్చే వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. అనధికారికంగా జియాగూడ మేకల మండి కొనసాగుతున్నప్పటికి జీహెచ్‌ఎంసీ మాత్రం పార్కింగ్ టెండర్ల ద్వారా డబ్బులు దండుకుంటుంది. కానీ మండి సమస్యలను ఎంత మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.

మండికి వచ్చే వాహనాలు రోడ్డుపైనే....

◆ జియాగూడ మేకల మండిలో ఉన్న స్థలాన్ని పార్కింగ్‌కు వాడుకోనున్నారు. ప్రస్తుతం ఉన్న స్థలంలో మేకల విక్రయాలకు షెడ్డును నిర్మిస్తున్నారు. మండికి ప్రతిరోజు వందల సంఖ్యలో భారీ వాహనాలు వస్తాయి. భారీ సంఖ్యలో మేకలు, గొర్లను దిగుమతి చేసుకుంటారు. షెడ్డు నిర్మాణంతో వాహనాలను జాతీయ రహదారిలో నిలిపి అక్కడే మేకలను దింపుతున్నారు. మండికి కూతవేటు దూరంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఉన్నా పట్టించుకోవడం లేదు.

దుర్గంధం.. దుర్వాసన

◆ ఇక మండిలో గొర్రెమేకలను కొనుగోలు చేసేందుకు వచ్చే వినియోగదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండి సమస్యలు, వాహనాల రాకపోకల రద్దీ, పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైనే వాహనాలు నిలిపివేత, మండిలో సరైన రహదారి లేక, దుమ్ము, ధూళి, పూర్తిగా అపరిశుభ్రత వాతావరణం, స్లాటరింగ్ పరిసరాలు పూర్తిగా బురద, దుర్గంధం తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

◆ ఇక అర్ధరాత్రి నుంచే ప్రారంభమయ్యే వ్యాపారాలు చిమ్మ చీకటిలోనే కొనసాగుతాయి. మండి పరిసరాలు సైతం చెత్తాచెదారం వల్ల కేశవస్వామినగర్, న్యూగంగానగర్, నవోదయ నగర్, సత్యనారాయణనగర్ ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ తగు చర్యలు తీసుకోవాలని బస్తీల ప్రజలు కోరుతున్నారు.


మండి గేట్ పరిసరాల్లో చెత్తాచెదారం

బాధితులకు పట్టాలు ఇవ్వాలి


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న కృష్ణానాయక్

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలను కోల్పోయిన 72 మంది బాధితులకు ప్లాట్ నంబర్ కేటాయిస్తూ పట్టాలు ఇవ్వాలని సీపీఎం జంగమ్మెట్ డివిజన్ కార్యదర్శి ఎ.కృష్ణానాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. 2015లో ఇళ్ల నిర్మాణం కోసం అక్కడ ఉన్న ఎంసీహెచ్ క్వార్టర్స్‌లోని 72 మందిని ఖాళీ చేయించారని తెలిపారు. నిర్మాణం అనంతరం కేవలం అర్హులుగా మాత్రమే గుర్తించారన్నారు. కాని వారికి సంబంధించిన ప్లాట్ నంబర్‌లో పట్టా ఇవ్వలేదని తెలిపారు. డబుల్ బెడ్రూమ్ సముదాయంలో మంచినీరు, విద్యుత్ సదుపాయం కూడా కల్పించాలని కోరారు. తమ సమస్యలను విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కృష్ణానాయక్ తెలిపారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, శేఖర్, సంగీత, సబిత, ఆకూబాయి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఐఫోన్ ప్రాడెక్ట్స్ విక్రేతల అరెస్ట్



గన్‌ఫౌండ్రీ: యాపిల్ ఐ ఫోన్‌కు చెందిన నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్న సెల్‌ఫోన్ షాపులపై సోమవారం సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జగదీష్ మార్కెట్‌లోని ఆర్‌జీ.మొబైల్, మాతాజీ, రాజారామ్ న్యూ డ్రీమ్ సెల్‌ఫోన్ షాపులపై దాడులు నిర్వహించిన పోలీసులు పెద్ద ఎత్తు నకిలీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖైరతాబాద్‌కు చెందిన మహ్మద్ అర్షద్ (డ్రీమ్స్ మొబైల్స్), గౌలిగూడకు చెందిన విక్రమ్ సింగ్, (మాజీ మొబైల్స్), అబిడ్స్‌కు చెందిన నాసారామ్, (శ్రీ రాజామ్ మొబైల్స్), గౌలిగూడకు చెందిన సురేష్ కుమార్, (ఆర్‌జీ మొబైల్స్) పేరిట వ్యాపారం చేస్తున్నారు. కాగా వీరు ఐఫోన్‌కు చెందిన నకిలీ ఉత్పత్తులను ఒరిజినల్ పేరుతో వినియోగదారులకు అంటగడుతున్నారు. దీనిపై ఐఫోన్ సంస్థకు సమాచారం అందడంతో కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పలు షాపులపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నుంచి 72 యాపిల్ ఐఫోన్ పార్ట్స్, 61 యూఎస్‌బీ కేబుల్స్, 45 బ్యాటరీలు, 95 బ్యాక్ గ్లాసెస్, 430 యాపిల్ ఫోన్ స్టిక్కర్లు, 84 ఇయర్ బడ్స్ తదితర ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. కోటికి పైగా ఉంటుందని తెలిపారు. నిందితులపై కాపీరైట్స్ యాక్ట్, ఫోర్జరీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోట బోనాలకు అందరూ సహకరించాలి

టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్



ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను సన్మానిస్తున్న గోల్కొండ ఆలయ బోనాల కమిటీ ప్రతినిధులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు విజయవంతం చేయడానికి అందరి సహకారం అవసరమని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండ కోటలో కొలువుదీరిన శ్రీజగదాంబిక మహంకాళి బోనాల కమిటీ చైర్మన్ కె.చంటిబాబు సోమవారం ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోల్కొండ కోట బోనాల ఏర్పాట్ల వివరాలను ఏసీపీకి వివరించారు. అనంతరం ఏసీపీ సయ్యద్ ఫయాజ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రానికే గోల్కొండ బోనాలు తలమానికమని అన్నారు. బోనాలు పూర్తయ్యేంత వరకు లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరానున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. త్వరలో స్థానికులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ, బల్దియా అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామన్నారు. అందరి సలహాలు, సూచనలు తీసుకుని కోట బోనాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఈ రాజేంద్రప్రసాద్, ఎస్సై రఫీయుద్దీన్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎన్.శ్రీకాంత్, పీస్ కమిటీ సభ్యులు ఆబేద్, ఇలియాస్, ఆజాం తదితరులు పాల్గొన్నారు.

ధూల్‌పేట్‌లో గంజాయి పట్టివేత

అబిడ్స్: ధూల్‌పేట ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి 1.162 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ధూల్‌పేట్ ప్రాంతంలో ఒక ఇంట్లో గంజాయి విక్రయిస్తున్న సమాచారంతో స్టేట్ ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీమ్ ఇన్‌చార్జ్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. సోనియాబాయిని అరెస్టు చేసి గంజాయి విక్రయంతో సంబంధం ఉన్న సతీష్ పాల్ సింగ్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు అంజిరెడ్డి మాట్లాడుతూ.. ధూల్‌పేట పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, దాదాపు తగ్గుముఖం పట్టాయన్నారు. ఎవరైనా సమాచారం అందిస్తే వారిపై దాడులు నిర్వహించి కఠినంగా వ్యవహరిస్తున్నామని వెల్లడించారు.

సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకురండి

చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న కోరారు. చాంద్రాయణగుట్ట పూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్లకు చెందిన టౌన్ ప్లానింగ్ సమస్యలపై మొత్తం 2 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జెడ్‌సీ వెంకన్న మాట్లాడుతూ... ప్రతి సోమవారం తమకు అందిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని అన్నారు. చార్మినార్ జోన్ పరిధిలోని మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజావాణిలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటాం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గోల్కొండ: తమ కాలనీ అసోసియేషన్, వీనస్ హైస్కూల్ తరపున సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటామని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ హిదాయత్ అలీ ఖాన్ అన్నారు. సోమవారం టోలిచౌకీలోని వీనస్ హైస్కూల్‌లో డీలక్స్‌కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తరపున ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మందికి మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 20 మందికి కంటి, 35 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టోలిచౌకీ పరిసరాల్లో నివసించే నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. గతంలో జరిగిన కంటి, గైనిక్ వైద్య శిబిరాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. కంటి వైద్యశాలల డాక్టర్లు కంటి పరీక్షలు ఉచితంగా కంటిచికిత్సలు చేశారన్నారు. అంతేకాకుండా అవసరమైన వారికి కళ్లద్దాలను ఉచితంగా అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జునైది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు


జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చాంద్రాయణగుట్ట: ప్రభుత్వ యూఎల్‌సీ భూమిలోని ఆక్రమణలను బండ్లగూడ మండల రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఉప్పుగూడ క్రాంతినగర్ సర్వే నం.86లోని యూఎల్‌సీ(అర్బన్ ల్యాండ్ సీలింగ్) భూమిలో గతంలో ప్రభుత్వం తరపున రెండు గదులను నిర్మించారు. కొందరు వాటిని ఆక్రమించడంతో పాటు పక్కనే ఉన్న స్థలంలో కూడా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో స్పెషల్ ఆర్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, నవీన్, కృష్ణ గౌడ్, సర్వేయర్ శ్రీనాథ్ బృందంతో జేసీబీతో ఛత్రినాక పోలీసుల బందోబస్తు నడుమ కూల్చివేశారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

మీటర్లు ఇచ్చిన అధికారులపై సైతం చర్యలు తీసుకోవాలి..

ప్రభుత్వ స్థలంలో తాత్కాలికంగా నిర్మించుకున్న చిన్నపాటి నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి డిమాండ్ చేశారు. 86 సర్వే నంబర్‌లో కూడా రెవెన్యూ అధికారులు అసంపూర్తిగానే కూల్చివేతలు చేపట్టారన్నారు. ఆక్రమణలో ఉన్న మిగతా స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జంతువులను తరలిస్తే కఠిన చర్యలు



అక్రమ రవాణాను అరికట్టడానికి ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

నాంపల్లి: బక్రీద్ సమీపిస్తున్న నేపథ్యంలో జంతువుల అక్రమ రవాణాను అరికట్టడానికి మాసబ్ ట్యాంక్ పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. మాసబ్‌ట్యాంక్‌లోని హోటల్ పార్కు కాంటినెంటల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టును సోమవారం మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆవులు, ఎద్దులు, ఒంటెలను శ్లాటర్ హౌస్‌లకు తరలించకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అయినా నిబంధనలను అతిక్రమించి ఎవరైనా జంతువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఎస్సై రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలకే పరిమితమైతే
సమస్యలు ఎలా తెలుస్తాయి?

- అధికారులు బస్తీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలి
- కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



బల్దియా అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్, చెక్కు అందుకుంటున్న లబ్ధిదారుడు

గోల్కొండ: అధికారులు బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాడైన రోడ్లు, పేరుకుపోతున్న చెత్త కుప్పలపై తనకు నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. దోమల బెడద కూడా తీవ్రంగా ఉందని చెప్పారు. అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే సమస్యలు ఎలా తెలుసుకొగలుగుతారని అన్నారు. అదే విధంగా సమస్యలను పరిష్కరించడంలో కూడా కాలయాపన చేయకుండా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

వీధుల్లో స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు...

బల్దియా స్ట్రీట్ లైట్ విభాగం అధికారులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలియడం లేదన్నారు. వీధుల్లో స్ట్రీట్ లైట్లు వెలగడం లేదన్నారు. మరోవైపు రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు, రోడ్ల పక్కనే చెత్త కుప్పలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యలకు తోడు అభివృద్ధి పనులు సైతం సకాలంలో పూర్తి కావడం లేదన్నారు. కాంట్రాక్టర్లు చేపడుతున్న పనులపై పర్యవేక్ష లేకపోవడంతో వారు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఏఈ లాల్‌సింగ్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ...

అర్హులైన నిరుపేదలకు వైద్య చికిత్సలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం లభిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. టోలిచౌకీలోని తన కార్యాలయంలో కార్వాన్, గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాలకు చెందిన లబ్దిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శస్త్రచికిత్సలు, వైద్య కోసం సీఎంఆర్‌ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు అవసరమైన ధ్రువపత్రాలను జత చేయాలన్నారు. అప్పుడే చెక్కులు మంజూరవుతాయని తెలిపారు. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటి ప్లాంట్ల ప్రారంభం

అఫ్జల్‌గంజ్: ప్రతి నిత్యం వేలాది మంది పేద రోగులు వచ్చే ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి సహాయ సహకారాలు అందించేందుకు ముందుకొస్తున్న కార్పొరేటర్ సంస్థలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ అన్నారు. సోమవారం ది వీస్ ల్యాబొరేటరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోని 8 వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాంట్లను ఆర్‌ఎంఒలతో కలిసి ఆయన ప్రారంభించారు.

గుండెపోటుతో డబీర్‌పురా ఏఎస్సై నర్సప్ప మృతి



డబీర్‌పురా: డబీర్‌పురా పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న నర్సప్ప (57) సోమవారం తెల్లవారుజామున ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. నర్సప్పకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న హైదరాబాద్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు, హైదరాబాద్ పోలీస్ కో–ఆపరేటివ్ సొసైటీస్ సెక్రటరీ ఎన్. శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కో–ఆపరేటివ్ సొసైటీ కోశాధికారి విక్టర్, జాయింట్ సెక్రటరీ నవీన్,ఉపాధ్యక్షులు శ్రీశైలం, సంఘం సభ్యులతో పాటు డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ నానునాయక్, డీఐ శంకర్, ఎస్సైలు శ్రీధర్, నరేశ్, నాగన్న, సిబ్బంది ఎల్‌బీనగర్ ఎన్టీఆర్‌నగర్‌లోని ఆయన నివాసానికి చేరుకొని నివాళులర్పించారు.